## క్లుప్తంగా

### తహసీల్దార్‌గా తాతారావు



వై.రామవరం: మండల నూతన తహసీల్దార్‌గా ఎ.తాతారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఆయన రంపచోడవరం ఐటీడీఏలో డీటీగా పనిచేసి పదోన్నతిపై వై.రామవరం తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన కె.సుధాకర్ తన డీటీ పదవులోకి రీబేక్ అయ్యారు. తహసీల్దార్ తాతారావు తమ సిబ్బందితో సమావేశం నిర్వహించి, విధుల నిర్వహణపై సలహాలు సూచనలిచ్చారు.

### నేడు మండల సమావేశం

దేవీపట్నం: మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.ఎస్.రత్నకుమారి తెలిపారు. ఇందుకూరుపేటలోని వెలుగు కార్యాలయంలో ఎంపీపీ కుంజం మురళీ అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతున్నట్టు పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

### రేపు దూసరపాములో వైద్య శిబిరం

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. గ్రామంలో సిటీ మల్టిస్పెషాలిటీ హాస్పిటల్, కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో జనరల్, ఆర్థోపెడిక్, గైనకాలజి సమస్యలతో పాటు, బీపీ, సుగర్ పేషెంట్లకు ప్రత్యేక చికిత్స అందిస్తారని కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న కల్వరి గ్రేస్ చర్చ్ పాస్టర్ సుధాకర్ తెలిపారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### వాహనాల తనిఖీ



కారులో వస్తువులను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐలు

కొయ్యూరు: మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో కొయ్యూరు, మంప ఎస్‌ఐలు రాజారావు, లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహన రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. వారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపవద్దని సూచించారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్, సీబుక్ తదితర రికార్డులు తమ వెంట ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు.

### ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

సీలేరు: సీలేరులో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణం ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సీలేరు జల విద్యుత్ కేంద్రం నిర్మాణం సమయంలో ఈ ఆంజనేయ స్వామి ఆలయం నిర్మించారు. నేటికీ 60 ఏళ్లు కావస్తున్న ఆలయం శిథిలదశకు చేరుకోవడంతో పునఃనిర్మాణం చేపట్టి ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిరాజ్ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగించి, జలాదివాసం చేపట్టారు. ఆలయంలో శనివారం ఆంజనేయస్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ట నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

### చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



సూచనలిస్తున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: మండలంలోని సూరేంద్రపాలెం, రాజేంద్రపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో విజయకుమారి గురువారం సందర్శించారు. రికార్డులు, స్టాకులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యం, పౌష్టికాహారం లోపంతో ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సక్రమంగా పౌష్టికాహారాన్ని అందజేయాలని ఆదేశించారు. బాలింతలు, గర్భిణులతో మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతీ నెల చిన్నారులు బరువు, ఎత్తు విధిగా చూడాలని ఆదేశించారు.



# జీసీసీ దూకుడు

- జోరందుకున్న గిరిజన సహకార సంస్థ కొనుగోళ్లు
- ఆశాజనకంగా చింతపండు దిగుబడులు
- నిమగ్నమైన గిరిజన రైతులు



జీసీసీ కొనుగోలు చేస్తున్న చింతపండు

అనంతగిరి: అటవీ సంపద గిరిజనుల జీవనానికి ఆసరాగా నిలుస్తున్నాయి. అడవుల్లో లభించే కాఫీ, చింతపండు, పసుపు, మిరియాలు, తేనె తదితర వస్తువులు విక్రయించి అడవి బిడ్డలు జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఏజెన్సీలో చింతపండు సీజన్ ప్రారంభమైంది. ఫిబ్రవరి నుంచి మే వరకు చింతపండు సేకరణ, విక్రయాల మార్కెట్ జోరుగా సాగుతోంది.. మూడేళ్ల క్రితం చింతపండు దిగుబడి లేకపోవడంతో చింతపండు రైతులు ఆందోళన చెందారు. కరోనా సమయం సంతలు లేకపోవడంతో సేకరించిన చింతపండు కొనుగోలుకు అంతంత మాత్రంగానే ఉండేది.. గత ఏడాది దిగుబడి బాగానే ఉండగా, ఈ ఏడాది దిగుబడి అధికంగా ఉంది. జీసీసీ చింతపండు కొనుగోలు ప్రారంభించడంతో గిరి రైతుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. సంతల్లో గిరి రైతులు దళారుల బారిన పడి మోసపోకుండా జీసీసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. రైతుల నుంచి జీసీసీ నేరుగా కొనుగోలు చేస్తోంది. గిట్టుబాటు ధరలు వస్తుండడంతో రైతులు ఆనంద పడుతున్నారు. దళారుల కన్నా జీసీసీ గిట్టుబాటు ధరతో కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుత సీజన్‌లో రూ.32.40లతో జీసీసీ కొనుగోలు ప్రారంభించింది. ఏజెన్సీలో లభించే చింతపండుకు మైదాన ప్రాంతాల్లో డిమాండ్ ఉంది. చింతపండు సేకరణలో ప్రస్తుతం గిరిజన రైతులు నిమగ్నమైయ్యారు. దిగుబడి అధికంగా ఉండడంతో లాభాలు లాభాలు వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**సంతలు కళకళ**

జిల్లాలో సుంకరమెట్ట, అరకు, కించుమండ, ముంచంగిపుట్టు, పెదబయలు, హుకుంపేట, వంట్లమామిడి, జి.మాడుగుల, చింతపల్లి ప్రాంతాల్లో ప్రధాన సంతలు జరుగుతాయి. అటవీ ఉత్పత్తులతో పాటు కూరగాయలు, ఆకుకూరలు, ఫలాల వ్యాపారం జోరుగా జరుగుతుంది. అనంతగిరి మండలంలోని జరిగే మూడు ప్రధాన వారపు సంతలు సంతలు చింతపండు రైతులతో కళకళలాడుతుంది. సోమవారం అనంతగిరి మండల కేంద్రంలోని జరిగే వారపు సంత, బుధవారం జరిగే డముకు, కాశీపట్నం వారపు సంతల్లో ఆయా చుట్టుపక్కల గ్రామాలు నుంచి ఈ ఏడాది అధికంగా చింతపండు పట్టుకుని రైతులు వస్తుండడంతో సంతలు కళకళలాడుతున్నాయి. సంతల్లో జీసీసీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి చింతపండును కొనుగోలు చేస్తున్నారు.



చింతపండు సేకరిస్తున్న గిరిజనులు

**4 వారాలు.. 35.5 టన్నుల కొనుగోలు**

ఈ ఏడాది చింతపండు సీజన్ ప్రారంభం నుంచి జీసీసీ జోష్‌తో ఉంది. మొదటి వారం నుంచి ఈ నాలుగో వారం వరకు 35.5 టన్నుల చింతపండు కొనుగోలు చేసింది. ఈ నాలుగు రోజుల్లో ఎక్కువగా కొనుగోలు చేశారు. దళారులు కన్నా జీసీసీ గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తుండడంతో రైతులు సైతం జీసీసీకే చింతపండును విక్రయిస్తున్నారు.

**దళారులను ఆశ్రయించొద్దు**



దళారులు నమ్మిమోసపోద్దు. అడవుల్లో సేకరించి చింతపండును గిట్టుబాటు ధరతో జీసీసీ కొనుగోలు చేస్తుంది. జీసీసీ వద్ద నేరుగా రైతులు తూకం వేసుకోవచ్చు. జీసీసీకే చింతపండును విక్రయించి, గిట్టుబాటు ధరలు పొందవచ్చు.

– దుర్గాప్రసాద్, జీసీసీ మేనేజర్, అనంతగిరి

# సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



ఉపాధ్యాయులకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, నేతలు



ప్రచారం నిర్వహిస్తున్న రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి



అరమలో పర్యటిస్తున్న జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీపీ ఈశ్వరి



ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్

కొయ్యూరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. మండలంలోని గురుకుల జూనియర్ పాఠశాల, ఆశ్రమ పాఠశాల బాయ్స్–2ను ఆమె గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేయాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు ఎం.విశ్వేశ్వరరాజు, ఎంపీపీ బడుగు రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు బాబులు, జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ, మండల కన్వీనర్ సుధాకర్, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, ఎంపీటీసీ సభ్యులు మల్లేశ్వరి,అప్పారావు, నాయకులు సత్యనారాయణ, సావిత్రి, గంగరాజు, శేఖర్, సోమన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్/అనంతగిరి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఓటర్లను కోరారు. అరకులోయ పట్టణంతో పాటు అనంతగిరి మండలంలోని గూడ,కొంతిలి, గత్తుంబొడ్డాపుట్టు ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలను ఆయన గురువారం సందర్శించి, ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. చినలబుడు పంచాయతీలో ఎమ్మెల్యే పాల్గుణ ఆదేశాల మేరకు నాయకుడు రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ కన్వీనర్ సంపత్‌కుమార్, అనంతగిరిలో ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, కో–ఆప్షన్ సభ్యుడు మదీనా, నాయకులు శెట్టి అప్పాలు, రఘునాథ్, నర్సింగరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని గూడ, కొంతిలి, గత్తుం బొడ్డాపుట్టు ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, మట్టుజోరు పంచాయతీలో ఎంపీపీ కూడా రాజుబాబు, తాడిపుట్టు పంచాయతీలో జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం తదితరులు ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు సింహాచలమ్మ, సర్పంచ్ సాంభ, మండల కో–కన్వీనర్ కె.కోటిబాబు, నాయకులు రవీంద్ర, కొండబాబు, చంటి, శేఖర్, అశోక్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని అరమ, తూటంగి, గుంటసీమ పంచాయతీల్లో ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీలు ఆనందరావు, లలిత,ఎంపీటీసీ రామరావు, సర్పంచ్ శారధ, లీలారాణి, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి, నాయకులు సింహాచలం, కృష్ణారావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: గూడెం కొత్తవీధి మండల సీలేరు, దుప్పులవాడ, దారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల్లో రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ కుమారి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు బుజ్జి, సీలేరు ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి, నాయకురాలు విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని అడ్డంగిసింగి, వెన్నెల, సింగర్భ, జి.మాడుగుల తదితర గ్రామాల్లో మండల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, పీపీసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు, ఎంపీటీసీ సన్యాసిదొర, సచివాయ మండల కన్వీనర్ కళ్యాణం, నాయకులు సూర్య ప్రకాష్ నాయుడు, లక్ష్మణ్, కొంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతికి సీఎం కృషి



మహిళను సన్మానిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ శెట్టి నీలవేణి



గంగవరంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నేత రుక్మిణిదేవి



రంపచోడవరంలోని వేడుకలో పాల్గొన్న మహిళలు

అనంతగిరి: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో తమదైన ముద్రను వేసుకుంటూ రాణిస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలోని హోలీ స్పిరిట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో మహిళలతో కలిసి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మహిళ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, ఎంపీటీసీ సన్యాసిరావు, కో–ఆప్షన్ సభ్యుడు మదీనా, టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడు శెట్టి వెంకటరావు, నాయకులు గంగులు, సోషల్ మీడియా కన్వీనర్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో సీడీపీవో నీలమ్మ గ్రామ సచివాలయ మహిళా పోలీసులను ఘనంగా సత్కరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: ఎమ్మార్సీ భవనంలో యూటీఎఫ్ మండల మహిళా అధ్యక్షురాలు ఎల్.రుక్మిణిదేవి నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలో మహిళా ఉపాధ్యాయులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. నాగమణి, లక్ష్మి, సత్యవతి, అన్నపూర్ణేశ్వరి, రామ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు శారపు పావని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: స్థానిక యూటీఎఫ్ అతిథి గృహంలో నిర్వహించిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో సంఘం సహాధ్యక్షురాలు కవిత, ఎంఈవో సత్యనారాయణదొర పాల్గొన్నారు. ఉత్తమ సేవలందించిన మహిళలను సన్మానించారు. సత్యవేణి, మంజుల, మౌనిక, సుస్మిత, సనాతన్‌బాబు, వెంగళరావు, సూరిబాబు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

### సాయినాథునికి ప్రత్యేక పూజలు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

### వైభవంగా నూకాంబిక ఆలయ ప్రారంభోత్సవం

కోటవురట్ల : కైలాసపట్నంలో నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని గురువారం వైభవంగా ప్రారంభించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమం నిర్వహించగా భక్తులు పూజలు చేశారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బాబూరావు అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డన చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, టెలికం అడ్వైజరీ కమిటీ మెంబర్ యల్లపు కుమారరాజా, సర్పంచ్ పెన్నాడ నూకరత్నం, ఎంపీటీసీ ఎస్.రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు నాగేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు సత్యనారాయణరాజు, నానాజీ, వరహాలు పాల్గొన్నారు.

### ఘనంగా పరదేశమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని జగ్గన్నపేటలో పరదేశమ్మ వారి ఆలయాన్ని పునఃనిర్మించారు. వేద మంత్రాల మధ్య గురువారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటం, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. కృష్ణ, బుజ్జి, రమణ,అప్పారావు, పారునాయుడు, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

# సర్పంచ్ కుటుంబానికి అండగా ఉంటాం



సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: అనారోగ్యంతో మృతి చెందిన ఆకూరు సర్పంచ్ కత్తుల వరలక్ష్మి కుటుంబాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి గురువారం పరామర్శించారు.ఆకూరు జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సర్పంచ్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. రంపచోడవరం మండల వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, మండల సచివాలయాల కన్వీనర్ పండా రామకృష్ణదొర, నందూరి రాంబాబు , ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు .

# పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు



థింసా నృత్యం చేస్తున్న విద్యార్థులు

జి.మాడుగుల: విద్యార్థులకు ఇంటర్మీడియెట్ విద్య భవిష్యత్తుకు ఎంతో కీలకమని గురుకులం ప్రిన్సిపాల్ పారయ్య తెలిపారు. మండలం కేంద్రంలోని గురుకులం కళాశాలలో ఇంటర్ విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం సందడిగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధ, పట్టుదలతో చదివితే అత్యధిక మార్కులు సాధించవచ్చన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ గణేష్, కెజీబీవీ ప్రత్యేక అధికారి పార్వతి, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## కంటి వ్యాధులపై అప్రమత్తం



అరడకోటలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు కిశోర్‌కుమార్

పెదబయలు: మండలంలోని అరడకోట గ్రామ సచివాలయంలో వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అప్తమాలజిస్టు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శిబిరంలో 73 మంది కంటి సంబంధిత వ్యాధులతో వచ్చారన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం మూడో విడతలో భాగంగా పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. విడతల వారీగా పరీక్షలు చేసి ఉచితంగా కళ్లద్దాలు అందజేశామన్నారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో శిబిరాలు నిర్వహిస్తున్నామని, దృష్టి లోపం ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది మూర్తి, జ్యోతి, రత్నాలమ్మ, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

# గ్రామాల్లో బోర్లకు మరమ్మతులు



నర్సింగపేటలో బోరుకు మరమ్మతులు చేయిస్తున్న పాపారావు

కూనవరం: వెంకటాయపాలెం పంచాయతీ పరిధిలోని నర్సింగపేట, జెడ్డివారి గుంపు, దూగుట్ట గ్రామాల్లో చేతి బోర్లు మరమ్మతుకు గురికావడంతో కొద్ది రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది.

ఈ విషయం తెలుసుకున్న వెంకటాయపాలెం సర్పంచ్ సోందె మత్తమ్మ ఆధ్వర్యంలో గురువారం ఆయా ప్రాంతాల్లోని పాడైన బోర్లకు మరమ్మతులు చెపట్టారు. మండల పార్టీ యూత్ కన్వీనర్ సోందె పాపారావు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రసాద విక్రయాలకు వేలంపాట



శ్రీరామగిరి ఆలయంలో వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

వీఆర్ పురం: శ్రీరామగిరి సుందర సీతారామ చంద్రస్వామిఆలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని కొబ్బరి కాయలు, లడ్డు ప్రసాద విక్రయించుకునేందుకు ఎండోమెంట్ ఆధ్వర్యంలో గురువారం వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో కొబ్బరికాయల విక్రయానికి సంబంధించి శ్రీరామగిరి గ్రామానికి చెందిన నాళ్లారపు సత్యనారాయణ రూ.1.25 లక్షలకు దక్కించుకున్నట్టు , లడ్డు ప్రసాదాల విక్రయానికి సంబంధించి భద్రాచలానికి చెందిన మంగవేణి రూ.48,500 లకు పాట దక్కించుకున్నట్టు ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్ సాయిబాబు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మెన్ రేవు బాలరాజు, సర్పంచ్ పులి సంతోష్, ఆలయ ప్రధాన అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు, ఉప సర్పంచ్ కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో విద్య అభ్యసించాలి



జూనియర్ కళాశాల వార్షికోత్సవ సభలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణ

గంగవరం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ కృష్ణ మాట్లాడుతూ అభివృద్ధికి విద్యే మూలమని ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

విద్యార్థులు నేటి కంప్యూటర్ యుగంతో పోటీపడుతూ ఉన్నత విద్యావంతులుగా ఎదుగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు శివాజీ, శ్రీలక్ష్మి, నఫిజా తదితరులు ప్రసంగించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించి విద్యార్థులను అభినందించారు.

# ఘనంగా గ్రామదేవతల జాతరలు

మాకవరపాలెం: మండలంలోని రెండు గ్రామాల్లో గ్రామదేవతల జాతరలు ఘనంగా నిర్వహించారు. శెట్టిపాలెంలో బోడకొండమ్మతల్లి, బయ్యవరంలో మావుళ్లమ్మ అమ్మవారి జాతరలను గురువారం స్థానికులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆలయాలకు చేరుకుని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి కమిటీల ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ జాతరలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**బంగారు శతమానాల బహూకరణ..**

బయ్యవరం గ్రామానికి చెందిన లాలం సూర్యనారాయణ దంపతులు మావుళ్లమ్మ అమ్మవారి పండగ సందర్భంగా రూ.1.60 లక్షల విలువ చేసే బంగారు శతమానాలను బహూకరించారు.

సర్పంచ్ లాలం కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

**మరిడిమాంబకు ప్రత్యేక పూజలు**

మాడుగుల రూరల్: కె.జె.పురం పాలగెడ్డ సమీపంలోని మరిడిమాంబ ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వేగి గాంధీ సారధ్యంలో సాయంత్రం భజనా కార్యక్రమం నిర్వహించారు. కాళ్ల వారి నూతి వద్ద ఎరుకుమాంబ, మహాలక్ష్మమ్మ ఆలయాల్లో పూజలు చేశారు.

# పైడితల్లమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

రాంబిల్లి : మామిడివాడలో గురువారం పైడితల్లమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దంపతులు శంకుస్థాపన పూజల్లో పాల్గొన్నారు. మామిడివాడ పరిసర గ్రామాల ప్రజలు పైడితల్లమ్మ అమ్మవారిని కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విశ్వసిస్తారు. ప్రస్తుతం వున్న ఆలయం పక్కనే నూతన ఆలయాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, రాంబిల్లి జెడ్పీటీసీ ధూళి నాగరాజు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, వైఎస్సార్‌సీపీ నేతలు బొద్దపు ఎర్రయ్యదొర, నెట్టెం సత్యనారాయణ, కొటాపు వడ్డికాసులు,రాఘవేంద్ర, ఎస్.సన్యాసిరావు, సర్పంచ్ అప్పలనర్స, నాగరాజు పాల్గొన్నారు.